# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## అప్పులు తెచ్చి మోటర్లు బిగించుకోవాలా ?



కాటారం, నవంబర్ 20 : నాకు మద్దులపల్లి గ్రామంలో రెండెకరాల పొలం ఉంది. వరి, పత్తి పంటలను సీజన్ బట్టి సాగు చేస్తున్న. 10 హెచ్‌పీ మోటర్లు ఎందుకు అసలు? ఇప్పుడున్న 3 హెచ్‌పీతో పుష్కలంగా నీళ్లు అత్తున్నయ్. పొలమంతా తడ్తాంది. ఇది చాలదా.. పోనీ, ఆ 10హెచ్‌పీ మోటర్లకు అయ్యే ఖర్చుకు రైతులు ఎక్కడికి పోయేది. మళ్లీ అప్పులు తెచ్చి బిగించుకోవాల్నా. మరి ఇప్పుడున్న మోటర్లను బయట పడేయాల్నా. ఆ 3 గంటల కరెంటు అద్దు.. ఆ కాంగ్రెస్ వద్దు.. ఇప్పుడు రైతులందరం సక్కగ ఎవుసం చేసుకుంటనం. 3 గంటలు కరెంటు చాలంటున్న కాంగ్రెస్ 3 గంటలు కూడా ఇత్తదన్న గ్యారెంటీ లేదు. వారిని నమ్మితే ఎనుకటి రోజులు వస్తయ్. కేసీఆర్ సర్కారు 24 గంటల కరెంటు ఇత్తాంది కదా.. అందరం బాగానే ఉన్నం గదా.. మరి కాంగ్రెస్‌కు ఎందుకు కండ్ల మంట. 3 గంటల కరెంటు ఇచ్చి ఎవ్వరి పొలం తడుపుతరు. ఎక్కువ ఎకరాలున్నోడి పరిస్థితి ఏమిటి? సంతోషంగా ఉన్నోళ్లను ఇబ్బందులకు గురి చేయాలనుకోవడం మంచిది కాదు.

*– డోలి రామయ్య, మద్దులపల్లి (కాటారం)*

## ధరణితో రైతులకు మేలు



మహాముత్తారం, నవంబర్ 20 : రైతులు భూ సమస్యలపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగకుండా సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకురావడం వల్ల మేలు జరిగింది. గతంలో పట్టా కోసం అధికారుల చుట్టూ తిరగడంతో కాళ్ల చెప్పులు అరిగిపోయేది. ఇప్పుడు భూమి కొనడం అమ్మడం ఇట్టే జరుగుతున్నది. పహణీ తీసుకోవాలంటే ఆన్‌లైన్‌లో క్షణాల్లో తీసుకుంటున్నం. కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తం అంటున్నరు. మళ్లీ పాత పద్ధతి వస్తే ఇబ్బంది పడాల్సి వస్తది. ఎనుకటిలెక్క చేతితో రాసే పట్టాలు అయితే అవకతవకలు అయి రైతులకు అన్యాయం జరుగుతది. ధరణి కొనసాగాలంటే కేసీఆరే సీఎంగా ఉండాలె.

*– ఆవుల రాజేందర్, కేశాపూర్, మహాముత్తారం, జయశంకర్ జిల్లా*

## దళారీ వ్యవస్థను తేవొద్దు



వెంకటాపూర్, నవంబర్ 20 : రైతులకు పారదర్శకంగా సేవలందిస్తున్న ధరణి పోర్టల్‌ను రద్దు చేసి రెవెన్యూ శాఖలో మళ్లీ పాత కాలం నాటి పటేల్ పట్వారి వ్యవస్థను తీసుకువస్తే దళారీ వ్యవస్థకు ఆజ్యం పోసినట్లు అవుతుంది. ధరణి ఫోర్టల్ వచ్చిన నాటి నుంచి రైతులకు భూ కొనుగోలు, విక్రయాలు సులభతరంగా మారాయి. మీ సేవలో స్లాట్ బుక్ చేసుకుంటే కేవలం అరగంటలోనే నేరుగా భూమి మన పేరుమీద పట్టా అవుతున్నది. గతంలో భూమి పట్టా చేయించుకోవాలంటే గ్రామంలో మధ్యవర్తికి ముడుపులు ఇచ్చి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరిగితే అప్పుడు అధికారులు దయతలిస్తే గానీ పట్టా అయ్యేది కాదు. అంతే కాకుండా మన భూములను ఇతరులకు పట్టా చేసేది. తహసీల్‌కు వెళ్తేగాని తెలిసేది కాదు. సీఎం కేసీఆర్ సారు తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో మన వేలిముద్ర లేకుండా భూమి ఇతరుల పేరుమీదకు మారడం అసాధ్యం. పాత రెవెన్యూ వ్యవస్థ వస్తే బతుకులు ఆగమవుతయ్.

*– బొమ్మ రవి, వెంకటాపూర్, ములుగు జిల్లా*



## మూడు గంటల కరెంట్ అంటే రైతులు మునుగుడే..

టేకుమట్ల, నవంబర్ 20 : తెలంగాణ వచ్చినసంది కరెంట్ మంచిగ ఉంటంది. ఎప్పుడంటే అప్పుడు చేన్లకు పోయి పంటకు నీళ్లు పెట్టుకుంటున్నం. 3గంటల కరెంట్ అంటే ఎట్ల సరిపోతది. రైతులందరూ ఒక్కసారే మోటర్లు వేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి కరెంట్ ట్రిప్ అయితది. లో వోల్టేజ్‌తో మా మోటర్లు కాలితే పంటలు ఎండి మునుగుడే అయితది. కాంగ్రెస్ హయాంల కరెంటు ఎప్పుడు వస్తదో తెలువక రాత్రి పడిగాపులు కాయాల్సి వచ్చేది. పంట చేతికందే సమయానికి మోటర్లు కాలి నీరు అందక ఎండిపోయి అప్పులపాలయ్యేది. మళ్లా నాటి చీకటి రోజులు యాదికొస్తే బయమేస్తన్నది. 10 హెచ్‌పీ మోటర్లా.. గవి ఇక్కడ ఏడ ఉన్నవి. అవి కోనాలంటే మళ్ల అప్పులు చేయాల్సి వస్తది. రైతులు సంతోషంగా ఉండుడు కాంగ్రెసోళ్లకు ఇష్టంలేనట్టున్నది. బీఆర్‌ఎస్ సర్కారుల నీళ్లు, కరెంట్‌కు ఎలాంటి రంది లేదు. నేను మిరప తోట, పత్తి, పొలం కలిపి 6 ఎకరాల్లో పండిస్తున్న ఎలాంటి ఢోక లేదు.

*– బాబురావు, అరెపల్లి, టేకుమట్ల మండలం*

## కాంగ్రెసోళ్లు 40గంటల కరెంట్ ఇస్తరట

ములుగు, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ) : నా పేరు ఈర్ల లింగయ్య, ములుగు మండలం బండారుపల్లి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24గంటల కరెంట్ ఇస్తున్నదంటే ఎప్పటికీ ఇచ్చినట్లే. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే 40గంటల కరెంట్ ఇస్తరట..! ఇదెట్ల సాధ్యం. నేను రెండు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్న. 20 గుంటల్లో ఎరువులు వాడకుండా వరి పండిస్తున్న. కేసీఆర్ సారు ఇస్తున్న 24 గంటల కరెంటుతో పొలానికి నీళ్లు మంచిగ పారుతున్నయ్. వ్యవసాయ బావికి 5హెచ్‌పీ మోటర్లు సాలు. 10హెచ్‌పీ మోటర్లు పెడితే బోర్లలో నీళ్లు ఉండద్దా. చెరువుల దగ్గర వాటిని వాడుతరు. ఇప్పుడున్న సర్కారు రైతులకు మంచి చేస్తున్నది. ఒకప్పుడు పొలానికి నీరు పారియ్యాలంటే చలిలో రాత్రి పూట పోయేది. ఇప్పుడు ఆ గోస లేదు. పొద్దున నుంచి సాయంత్రం వరకు పొలాలకు పారుతున్నాయి. 10హెచ్‌పీ మోటర్లు అంటే పైసలతో ముచ్చట. రైతుల దగ్గర పైసలు ఉండద్దా. మంచిగ నడిసేదాన్ని నడువనివ్వక కొత్త కొత్త ఆలోచనలు ఎందుకు. రైతులతో రాజకీయాలు చేయొద్దు.

*– ఈర్ల లింగయ్య, బండారుపల్లి, ములుగు మండలం, జిల్లా*



## 10హెచ్‌పీ మోటర్లు అవసరమే లేదు



ఏటూరునాగారం, నవంబర్ 20 : వ్యవసాయం చేసిండో లేదో కానీ రేవంత్‌రెడ్డికి ఏం తెలుస్తది. ఆయన చెప్పేది కరెక్టు కాదు. 10హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టాల్సి ఉంటది. అవి ఉంటయో కాలిపోతయో తెలియదు. నేను 12 ఎకరాల్లో మిర్చి తోట వేసిన. పది ఎకరాల్లో వరి సాగు చేసిన. మాగాణికి మూడు గంటలు మోటరు నడిస్తే ఒక ఎకరం పారుతది. మరి ఎక్కువ ఎకరాల్లో సాగుచేసేటోళ్ల పరిస్థితి ఏంది. 24గంటలకు కరెంటు పుష్కలంగా సరిపోతున్నది. పగలు మూడు గంటలు ఇచ్చినప్పుడు తడిపెట్టేది. అందరూ ఒక్కసారే మోటర్లు ఆన్ చేసేసరికి ఫ్యూజులు కొట్టేసి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే 200 నుంచి 300 అడుగల లోతుతో బోరు వేయాలి. 10 ఫీట్ల కేసింగ్ పైపులు వేయాలి. ఈ లెక్కన ఒక బోరు వేస్తే రూ.3లక్షలు ఖర్చు అవుతుంది. 10 హెచ్‌పీ మోటరు కొనాలంటే రూ. 40వేలకు పైగా అవుతది. అది కాలిపోతే రిపేరు చేయాలంటే రూ.10వేలు కావాలి. ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్లను బట్టి ఐదు 5హెచ్‌పీ మోటర్లు నడిస్తే 10 హెచ్‌పీ రెండు నడుస్తయి. ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచాలి. అది అయితదా. ఇక్కడ 60 అడుగులకే జల పడుతున్నది. దీనికి 10హెచ్‌పీ మోటరు పెడితే లోపల ఉన్న ఇసుక కాన్నుంచి బయటకు వచ్చి బోరు పాయింట్లు పనిచేయకుండా అయితయి. డ్రిప్ వచ్చిన తర్వాత కరెంటు, నీళ్లు వృథా కావడం లేదు. వాడకమే తగ్గింది. దీనికి 10హెచ్‌పీ మోటర్లు అవసరమే లేదు.

*– ఎగ్గడి కోటేశ్వర్‌రావు, మిర్చి రైతు, ఏటూరునాగారం*

## బోర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాల్సి వస్తది..



పలిమెల, నవంబర్ 20 : 10హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటే ఇప్పుడున్న బోర్లు, కరెంట్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ కొత్తగా ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పుడు నలుగురు రైతులు కలిసి ఒక ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకున్నాం. 10హెచ్‌పీ మోటర్లు పెడితే ఇంకో ఇద్దరి పరిస్థితి ఆగమైతది. రైతుల కష్టాలను చూసిన సీఎం కేసీఆర్ 24గంటల కరెంట్ ఇస్తున్నడు. కరెంట్‌పై రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తుండు. రైతు వ్యతిరేకి కాంగ్రెస్‌ను తరిమికొడితేనే రైతులు బాగుపడుతరు. ఉచిత కరెంట్ విషయంలో మళ్లీ మునుపటి లెక్కనే చేస్తామంటున్ను. పదేళ్లుగా రైతుల మేలుకోరే ప్రభుత్వం ఉన్నది. 24గంటల కరెంటు వల్ల 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్ల కింద రెండు పంటలు పండుతున్నాయి. రైతుల మేలుకోరే కేసీఆర్‌కే మద్దతు ఉంటుంది.

*– అగ్గు భాస్కర్ లెంకలగడ్డ, పలిమెల మండలం*

## ధరణి తీసేస్తే ఆగమవుడే..



చిట్యాల, నవంబర్ 20 : కాంగ్రెసోళ్లు ధరణి పోర్టల్ తీసేస్తమంటున్నరు. తప్పిదారి వాళ్లు వస్తే మళ్లీ పాత కథే అయితది. ఆఫీసుల చుట్టూ తిరుగుడు తప్పది. ఇప్పుడు ధరణి వల్లనే పత్రాలు భద్రంగా ఉంటానయ్. రైతులకు రైతుబంధు పైసలు పడతానయ్. అదేకాకుంట రైతు చనిపోతే రూ.5లక్షలతో ఆదుకునే రైతుబీమా సౌకర్యం ఉన్నది. ఇది కుటుంబానికి భరోసాగా ఉంటది. ధరణి పోతే ఇవన్నీ ఎట్లా అస్తయ్. కౌలుదారు/అనుభవదారు కాలం మళ్లీ పెడితే ఇప్పుడు పెరిగిన రేట్లు మారుతయ్. అదే ధరణి ఉంటే ఒక్కటే డిజిటల్ పట్టా పాస్‌బుక్ ఒకే రేటుకు అమ్ముకునేట్లుగా రైతుకు సమన్యాయం జరిగేలా ఉంటది. కాలం పేరుతో విభజిస్తే కాస్తులో ఉన్న రైతులపై పట్టాదారుల పెత్తనం మళ్లీ మొదలవుతుంది. పట్టాదారుగా రైతులు మార్చుకునేందుకు మళ్లీ ఆఫీసులు చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాలె. పైరవీలకు పైసలియ్యాలె. మళ్లీ ఎన్కటి లెక్క గోస పడాలె. అందుకే ధరణి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటేనే రైతులకు భరోసా ఉంటుంది.

*– చింతల సదానందం, కైలాపూర్, చిట్యాల, జయశంకర్ జిల్లా*

## మూడు గంటల కరెంట్‌తో ఒక్క మడైనా తడుస్తదా



కృష్ణకాలనీ, నవంబర్ 20 : రేవంత్‌రెడ్డి అన్నట్లు మూడు గంటల కరెంట్‌తో ఒక్క మడైనా తడుస్తదా? ఈ విషయం ఆయనకు తెలుసా.. నేను 3 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నా.. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ సార్ ఇస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో 3 ఎకరాల్లో నాణ్యమైనా పంట పండిస్తున్నా. కాంగ్రెసోళ్ల మాటలతో మళ్లీ తిరిగి పాత రోజులే వస్తాయంటే భయమేస్తున్నది. అప్పట్ల కరెంట్ ఎప్పుడు వసత్తదో తెలియదు... ఎప్పుడు పోతదో తెలియదు. రాత్రింబవళ్లు కరెంట్ కోసం ఎదురుచూసేవాళ్లం. రాత్రి కరెంట్ వస్తే పాములు, తేళ్లు అని చూడకుండా వెళ్లి పొలాలు, చేన్లు పారించుకునేటోళ్లం. రాత్రి కరెంట్‌తో అనేకమంది రైతులు విష పురుగల బారినపడి చనిపోయారు. మళ్లీ అదే పరిస్థితి వస్తదా? అని భయమేస్తుంది.

*– అమరగొండ భిక్షపతి, కాశింపల్లి, జయశంకర్ జిల్లా*